ప్రజాశక్తి

సోమవారం 27 మార్చి 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

రాష్ట్ర సదస్సులో అభివాదం చేస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు,
ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ఒపిఎస్ అమలు చేయాల్సిందే

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల రాష్ట్ర సదస్సులో నేతల డిమాండ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 'ప్రభుత్వ ఉద్యోగికి పెన్షన్ బిక్ష కాదు.. హక్కు. నూతన పెన్షన్ విధానం (ఎన్‌పిఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) అమలు చేయాలి. అప్పుడే ఉద్యోగులందరికీ న్యాయం జరుగుతుంది' అని పలువురు నేతలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి సదస్సు ఆదివారం విశాఖ డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యాన జరిగింది. కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రెడ్డి వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సును ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఎడరేషన్ (ఎఐఎస్‌జిఇఎఫ్), ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించాయి. 2004 తర్వాత విధుల్లో చేరిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అశనిపాతంలా పరిణమించిన కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి అందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని సదస్సు తీర్మానించింది. ఈ సదస్సులో ప్రధాన వక్త ఎఐఎస్‌జిఇఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీకుమార్, ప్రత్యేక అతిథి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ అధ్యక్షులు బండి శ్రీనివాసరావు, ఎఐఎస్‌జిఇఎఫ్ ఎపి - తెలంగాణ యూనిట్ ప్రధాన కార్యదర్శి ఎ.అజీజ్ మాట్లాడారు. సదస్సులో ఎఐడిఇఎఫ్, ఎన్ఎఫ్‌పిఇ, ఎఐఎస్‌జిఇ, ఐటిఇఎంఎఫ్, ఎన్‌సిఇ, సిసిజిఇ అండ్ డబ్ల్యు, ఎన్ఎడిసిఇయు సంఘాల నాయకులతోపాటు నేవల్ డాక్‌యార్డ్, ఎన్ఎడి, ఎన్ఎస్‌టిఎల్, ఎస్‌బిసి, డిజిఎన్‌పి, ఎంఇఎస్ తదితర రక్షణ రంగ సంస్థలు, పౌర, ఉద్యోగ సంఘాల నాయకులు, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొని సంఘీభావం తెలిపారు. (ప్రధాన వార్త మెయిన్‌లో..)

తెలుగు నేల కళలకు పుట్టినిల్లు

సినీ సంగీత దర్శకుడు థమన్
ఎయులో మ్యూజిక్ ప్రొడక్షన్ స్టూడియో ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తెలుగు నేల కళలకు పుట్టినిల్లు అని సినీ సంగీత దర్శకుడు ఎస్ఎస్ థమన్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంతో సెయింట్ లూక్స్ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆడియో ఇంజినీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ స్టూడియోను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ నగర కేంద్రంగా సంగీతానికి ఉపయుక్తంగా ఇంతటి భారీ స్టూడియో నిర్మాణం చేయడం పట్ల వర్సిటీ అధికారులను అభినందించారు. ఆంధ్ర రాష్ట్రం ఎందరో ప్రఖ్యాత కవులు, నటులు, సంగీత కారులకు జన్మస్థలమన్నారు. ఇక్కడి మిగతా 2లో..

నేటి స్పందన రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిల్లాలో జి-20 సదస్సు జరుగుతున్న సందర్భంగా సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

28న నగరానికి సిఎం రాక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జి 20 సదస్సులో పాల్గొనేందుకు సిఎం జగన్మోహన్ రెడ్డి ఈ నెల 28న విశాఖ నగరానికి రానున్నారు. ఆయన పర్యటన వివరాలను సిఎం అదనపు ప్రత్యేక కార్యదర్శి కె.నాగేశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 28 మంగళవారం సాయంత్రం 4:20 గంటలకు విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో సిఎం బయలుదేరి 5:15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా రాడిసన్ బ్లూ హోటల్‌కు వెళ్తారు. రాత్రి 7 గంటలకు జి 20 విదేశీ ప్రతినిధులతో కలిసి అక్కడే గాల డిన్నర్‌కు హాజరవుతారు. అనంతరం 8 గంటలకు రాడిసన్ బ్లూ హోటల్ నుంచి బయలుదేరి ప్రత్యేక విమానంలో 8:45 గంటలకు విజయవాడ చేరుకుంటారు.

సీతకొండ.. ఇక నుంచి వైఎస్ఆర్ వ్యూ పాయింట్

వార్త 2లో..

5న చలో ఢిల్లీని విజయవంతం చేయండి

వార్త 5లో..

ప్రభుత్వ విధానాలతో ప్రాథమిక విద్య నిర్వీర్యం

వార్త 5లో..

మారథాన్ విజేతకు బహుమతి, ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రులు రజని, సురేష్

ఉత్సాహంగా జి 20 మారథాన్

పరుగు తీసిన వందలాది మంది నగర వాసులు

వార్త మెయిన్‌లో..

ఆదాయం, సౌకర్యాలపై దృష్టి

అనకాపల్లి జిల్లా ప్రజా రవాణా అధికారి పద్మావతి

ప్రజాశక్తి - అనకాపల్లి : 'ఆర్‌టిసిలో నష్ట నివారణ చర్యలు చేపట్టాం. తొలి నుంచీ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. ఈసారి ఆదాయం పెంపు, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలపై దృష్టి పెట్టాం. మంచి ఫలితాలు వస్తున్నాయి' అని అనకాపల్లి జిల్లా ప్రజా రవాణా అధికారి పద్మావతి తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థలో నష్ట నివారణకు తీసుకున్న చర్యలు, బస్సుల పనితీరు, ఆదాయ వివరాలను ఆమె ప్రజాశక్తికి వివరించారు. ఆ విషయాలు ఆమె మాటల్లోనే...

నూతన జిల్లాలో ఆర్‌టిసి పరిస్థితి ఎలా ఉంది.

గత ఏడాది అనకాపల్లి నూతన జిల్లాగా ఆవిర్భవించింది. ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ఇక్కడ అనకాపల్లి, నర్సీపట్నం డిపోలతో ఉంది. 2021 - 22 ఆర్థిక సంవత్సరంలో నర్సీపట్నం డిపో రూ.16 కోట్లు, అనకాపల్లి డిపో రూ.22 కోట్ల నష్టంతో నడిచాయి. ఈ నేపథ్యంలో నష్ట నివారణకు చర్యలు చేపట్టాం. ప్రస్తుతం అనకాపల్లి డిపోలో 101, నర్సీపట్నం డిపోలో 101 ఉబస్సులున్నాయి. వీటిలో రెండు డిపోల్లోనూ 25 చొప్పున అద్దె బస్సులు నడుస్తున్నాయి.

డిపోల వారీ వస్తున్న ఆదాయాలు ఎలా ఉన్నాయి ?

అనకాపల్లి, నర్సీపట్నం డిపోలకు రోజువారీ రూ.12 లక్షలు చొప్పున ఆదాయం వస్తోంది. దీనిని ఒక్కో డిపోకు రూ.26 లక్షలకు పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం.

అనకాపల్లి జిల్లా జోన్‌లో ప్రథమ స్థానం దక్కించుకుంది.

కొత్త బస్సుల కొనుగోలు ప్రతిపాదన ఉందా ?

15 సంవత్సరాలు పూర్తయిన 20 బస్సుల స్థానంలో ఇతర డిపోల నుంచి 20 బస్సులను రప్పిస్తున్నాం. అలాగే 19 అద్దె బస్సులు కొత్తవి వస్తున్నాయి. అనకాపల్లి, నర్సీపట్నం డిపోల పరిధిలో 32 రూట్లలో బస్సులు నడుపుతున్నాం.

నష్ట నివారణ చర్యలు తీసుకున్నారా ?

నష్టాలను నివారించే చర్యల్లో భాగంగా డ్రైవర్లు, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

స్టూడియో ప్రారంభోత్సవంలో పాల్గొన్న సంగీత దర్శకుడు థమన్

తెలుగు నేల కళలకు పుట్టినిల్లు

భాష, యాస తమకు ఎంతో స్ఫూర్తిని అందిస్తాయన్నారు. తన విశ్రాంత జీవితాన్ని విశాఖ నగరంలో గడపడానికి ఇష్టపడతానన్నారు. భీమిలిలో తాను మ్యూజిక్ రికార్డింగ్ స్టూడియో నిర్మించే ఆలోచనలో ఉన్నానన్నారు. తనకు తల్లిదండ్రుల నుంచి సంగీతం వారసత్వంగా వచ్చిందన్నారు. సాంకేతికత అందుబాటులోకి రావడంతో నూతన గాయకులు పరిచయం అవుతున్నారన్నారు. సంగీతం ఉన్న ప్రదేశంలో గొడవలు ఉండవని, మ్యూజిక్ ప్రశాంతతను చేకూరుస్తుందని అన్నారు. మెదడుకు ఆక్సిజన్‌గా సంగీతం నిలుస్తుందన్నారు. సంగీతకారులు ఎక్కువ కాలం జీవిస్తారని తెలిపారు.

అనంతరం విద్యార్థుల కోరికతో నిన్నిలా...నిన్నిలా...చూసానే అంటూ పాటపాడి ఉర్రూతలూగించారు. ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ తొలి దశలో రూ.3.5 కోట్లు వెచ్చించి రికార్డింగ్ స్టూడియో, ప్రాక్టికల్ ట్రైనింగ్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి, సంగీత రంగంలో రాణించడానికి అవసరమైన కోర్సులను అందిస్తామన్నారు. అన్ని విభాగాల విద్యార్థులూ ఈ కోర్సులు చేసే విధంగా అవకాశం కల్పిస్తామన్నారు. అనంతరం వర్సిటీ తరపున థమన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు, ఆశీర్వాద్ లూక్స్, సెయింట్ లూక్స్ విద్యా సంస్థల అధినేత ప్రీతం లూక్స్, ఆచార్య సరస్వతి విద్యార్థి, జేమ్స్ స్టీఫెన్, టి.షారోన్‌రాజు, ఎకెఎం.పవార్ పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు.

ఆదాయం, సౌకర్యాలపై దృష్టి

కండక్టర్లకు అవగాహన కల్పిస్తున్నాం. ఆక్యుపేషన్ పెంచుతున్నాం. ప్రమాదాలను నివారించడం, బస్సుల పనితీరును మెరుగుపరచడం, నగదు రహిత లావాదేవీలు జరుపుతున్నాం. కార్గో బస్సుల ద్వారా 2021 – 22లో కోటీ ఆరు లక్షల ఆదాయం రాగా ప్రస్తుతం దానిని కోటీ 64 లక్షలు ఆదాయం దిశగా తీసుకెళ్తున్నాం. అలాగే యుటిఎస్ ఫోన్ పే ద్వారా ఆన్‌లైన్ టికెట్లు బుక్ చేయడం వంటి మార్గాల ద్వారా ఆదాయాన్ని మెరుగుపరుస్తున్నాం.

సీతంరాజు సుధాకర్‌తో మాట్లాడుతున్న అమర్‌నాథ్

సీతంరాజుతో మంత్రి అమర్‌నాథ్ భేటీ

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : ఇటీవల జరిగిన శాసన మండలి ఎన్నికల్లో ఓటమి చెందిన వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను మంత్రి అమర్‌నాథ్ ఆదివారం కలిశారు. ఎన్నికల్లో ఓటింగ్ జరిగిన తీరు, ఇతర అంశాల ప్రభావంపై చర్చించారు.

శ్రీదేవిది మోసపూరిత వైఖరి

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీకి జరిగిన ఎన్నికల్లో ఉండవల్లి శ్రీదేవి వైఖరి తనకు మొదటి నుంచీ అనుమానం కలిగించిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఆదివారం ఆయన బీచ్ రోడ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆమెను ఉండవల్లి శ్రీదేవి అనేకన్నా, ఊసరవెల్లి శ్రీదేవి అనడం బెటర్ అని వ్యాఖ్యానించారు. మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ శ్రీదేవి తల్లి పాలు తాగి రొమ్ము గుద్దిన చందంగా వ్యవహరించారని అన్నారు.

జి-20 సదస్సుకు భారీ భద్రతా ఏర్పాట్లు

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : జి – 20 సదస్సు నేపథ్యంలో విశాఖ నగరంలో ఈ నెల 27, 28, 29, 30 తేదీలలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశామని నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 1850 సివిల్ పోలీసు, 400 మంది అర్మ్‌డ్ రిజర్వు, 4 గ్రేహౌండ్స్ యూనిట్లు, 02 క్యుఆర్‌టి టీంలు, 6 స్పెషల్ పార్టీలు, 2 ఎపిఎస్‌పి ప్లటూన్లతో సుమారు 2500 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సు రోజుల్లో నగర వాసులు ఏ జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు.

రైతు గోడు పట్టదా..?

విశాఖ జిల్లాలో రైతు బజార్లపై అధికారుల పెత్తనం

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో

రైతు బజార్లలోని ఆకుకూరలు, పళ్లు, కూరగాయల స్టాల్స్‌పైనా, ధర నిర్ణయంపైనా రైతులపై అధికారుల పెత్తనం కొనసాగుతోంది. తన కుటుంబాన్ని పోషించుకోడానికి రైతు బజార్లకు వచ్చి మార్కెట్ చేసుకుని సాయంత్రానికి ఇంటికి వెళ్లాలనుకునే రైతులకు కనాకష్టంగా బజార్లు మారిపోతున్నాయి. విశాఖ నగరంలోని రైతు బజార్లకు కోడి కూయక ముందే రైతులు సరుకులతో వచ్చి తక్కువ ధరకు విక్రయాల ద్వారా అన్ని తరగతుల ప్రజానీకం అభిమానాన్నీ చూరగొంటున్నారు. ఒకప్పుడు ఉచితంగా స్టాల్స్ పెట్టుకునే అవకాశం ఉండేది. నేడు కనీసం రూ.3 వేలు చెల్లించకపోతే స్టాల్ దొరకని పరిస్థితి నెలకొంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను రైతు బజార్లోకి తెచ్చి విక్రయించడం ఒక ఎత్తయితే ఇటు ప్రభుత్వ అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలతో వారు చిత్తవుతుండటం బాధాకరం. ప్రజల రోజువారీ జీవనంలో రైతు బజార్లు భాగమైపోతున్న క్రమంలో రైతులను మాత్రం సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. రైతు ఎవరికైనా ఒక కార్డు ఉంటే ఆయన తరపున ఒక నామినీని పెట్టుకునే సౌలభ్యం గతంలో ఉంది. ఎందుకంటే ఒక్కరే రోజంతా అక్కడ ఉండలేరు. ఇంటిల్లిపాదిని పోషించుకోవడానికి రైతులు కష్టపడాల్సి ఉంది. ఏదైనా అనారోగ్యం, ఇతర విపత్కర పరిస్థితి వల్ల కార్డుదారుడైన రైతు మరణిస్తే ఆ కుటుంబం రోడ్డున పడకుండా నామినీకి అవకాశం వచ్చేది. తాజాగా ఈ అవకాశం లేకుండా విశాఖలోని రైతు బజార్లలో అధికారులు నిర్ణయం తీసుకోవడం రైతులకు శరాఘాతంగా మారింది. ఎంవిపి, సీతమ్మధార రైతు బజార్లలో పలువురు రైతులు ఈ వషయంపై విముఖత వ్యక్తం చేస్తున్నారు. కాలానుగుణంగా పంటలను రైతులు రైతు బజార్లలోకి తీసుకొస్తుండడం తెలిసిందే. బొప్పాయి, శనక్కాయలు, పండు మిరప, స్వీట్‌కార్న్, పుట్టగొడుగులు, తదితరాలను తీసుకొచ్చి విక్రయాలు జరుపుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

తాజాగా ఇక్కడ స్టాల్స్‌కు అద్దె చెల్లించడం తలకుమించిన భారంగా వారికి పరిణమించింది. రోజువారీగా ఒక రైతు అమ్మే కూరగాయలు కాకుండా కొత్తగా ఏదైనా సరుకు జోడించి అమ్మితే రైతుపై ఆర్థిక భారాన్ని ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు మోపుతున్నారు. అదనంగా మరో రూ.3 వేలు చెల్లించాలంటున్నారు.

ఈ నిర్ణయం రైతులను తీవ్రస్థాయిలో వేధింపులకు గురిచేస్తోంది. రోజంతా కష్టపడుతున్నా రూ.500 నుంచి రూ.600లే మిగులుతోందని, వాటిలో స్టాల్స్ అద్దెలకే ఎక్కువ మొత్తం పోతోందని పలువురు వాపోతున్నారు.

సీతకొండ.. ఇక నుంచి వైఎస్ఆర్ వ్యూ పాయింట్

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : జోడుగుళ్లపాలెం నుంచి సాగర్ నగర్ బీచ్‌కు వెళ్లే మార్గంలోగల సీతకొండ ప్రాంతానికి వైఎస్ఆర్ వ్యూ పాయింట్‌గా నామకరణం చేసి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజని, రాష్ట్ర పారిశ్రామిక, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. విశాఖ నగరంలో ఈ నెల 28, 29 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా జరుగనున్న జి – 20 సదస్సు నిర్వహణలో భాగంగా నగరంలో పలు చోట్ల అభివృద్ధి పనులు, సుందరీకరణ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సీతకొండనూ అందంగా తీర్చిదిద్ది పేరు మార్పు చేశారు. అనంతరం వ్యూ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన 'ఐ లవ్ వైజాగ్' సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి సురేష్ మాట్లాడుతూ ఈ వ్యూ పాయింట్‌ను సుమారు 2 కోట్లా 40 లక్షల రూపాయలతో జివిఎంసి అభివృద్ధి చేసిందన్నారు. దేశ విదేశాల నుంచి వస్తున్న విహార యాత్రికులకు దేశంలోనే ఒక ప్రత్యేక పర్యాటక ప్రాంతంగా విశాఖ నగరాన్ని చూపించాలనే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయం మేరకు విశాఖ నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. మంత్రి రజని మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతంలోని సాగర్ నగర్ బీచ్, దుర్గా టెంపుల్, గుడ్లవానిపాలెం బీచ్, జోడుగుళ్లపాలెం బీచ్‌లను అభివృద్ధి చేశామన్నారు. గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ తీర ప్రాంతాలను ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకూ దఫదఫాలుగా అభివృద్ధి పరుస్తున్నామన్నారు. మేయర్ హరి వెంకట కుమారి మాట్లాడుతూ కైలాసగిరి రోప్ వే నుంచి తిమ్మాపురం వరకు 11 కిలోమీటర్ల మేర రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ల మరమ్మతులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ సిఎస్ శ్రీలక్ష్మి, విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు, పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, 9వ వార్డు కార్పొరేటర్ కోరుకొండ వెంకటరత్న స్వాతి దాస్, వైసిపి నాయకులు గొలగాని శ్రీనివాస్, కార్పొరేటర్ విపిన్ జైన్, జివిఎంసి ప్రధాన ఇంజినీర్ పి.రవికృష్ణరాజు, అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, వర్మ పాల్గొన్నారు.

వ్యూ పాయింట్ వద్ద మంత్రులు, జిల్లా అధికారులు

'ది ఎంవివి పీక్' నిర్మాణం ప్రారంభం

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరంలో సిరిపురం జంక్షన్ వద్ద 22 అంతస్తుల విలాసవంతమైన అపార్టుమెంట్ల నిర్మాణానికి ఎంవివి గ్రూపు అధినేత, విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పటంలో ఒక ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న విశాఖ నగరంలోని ప్రజలకు విలాసవంతమైన ఫ్లాట్ల నిర్మాణంలో భాగంగా సిరిపురం జంక్షన్‌లో తమ సంస్థ ఆధ్వర్యంలో 'ది ఎంవివి పీక్' పేరుతో 30,588 చదరపు అడుగులు విస్తీర్ణంలో భారీ నిర్మాణం చేపడుతున్నామన్నారు. 22 అంతస్తులలో 3,903 నుంచి 5,424 చదరపు అడుగులు వైశాల్యంలోగల 3, 4, బెడ్ రూములు కలిగిన 220 ఫ్లాట్లను వంద శాతం వాస్తుతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ అపార్ట్‌మెంట్‌లో అదనపు సౌకర్యాలైన గ్రీన్ గ్రౌండ్ ఏరియా, ప్లే గ్రౌండ్, క్లబ్ హౌస్, పవర్ జనరేటర్, ఆల్ట్రా మోడరన్ జిమ్, మినీ థియేటర్, వాకింగ్ ట్రాక్, రెండు కార్లు పార్క్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. అపార్ట్‌మెంట్ కొనుక్కునే వారికి లైఫ్ టైం మెయింటెనెన్స్ కింద ఒకసారి నిర్ణీత రుసుము చెల్లిస్తే సరిపోతుందని అన్నారు. కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైసిపి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు పాల్గొన్నారు.

ది ఎంవివి పీక్ నమూనా

In the Honorable Court of the III Additional Junior Civil Judge at Anakapalle.
I.A.403/22 in I.A. 15/2019 in O.S. 111 of 2005.

Between:-
Kolli Suridemudamma. **...Plaintiff.**

And: -
Kolli Sanyasayya (died) and others. **... Defendants.**

To,
R8) Terracon Projects rep.by Srinivasa Venkata Babu @ S.V.Babu s/o Late Ramabhadra Setty, Hindu, aged 63 years, business, r/o Door No. 55-14-115; APSEB Colony, Seethammadhara, Visakhapatnam-13.

IA NOTICE.

The petitioner/ Plaintiff has filed the above petition for impleading you as a party in the above proceedings and the above petition stands posted to **dt.11-4-2023** for your appearance. Hence you are here by directed to appear either personally or through your counsel on that day before the above court, and if you fail to appear on or before **10.30 A.M.** on the date and time mentioned above, the matter will be proceeded in your absence.

P.A.Narasimham, Advocate, Anakapalle.. 94400 25466.

Anakapalle,
Dt.21-03-2023.

8:30 దాటితే బస్సులు నిల్

అప్పన్నను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ప్రయాణ అవస్థలు

ప్రజాశక్తి-సింహాచలం : పుణ్యక్షేత్రం సింహాచలం దేవస్థానానికి ఇతర జిల్లాలు, రాష్ట్రాలు, దేశ విదేశాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు నిత్యమూ వస్తూనే ఉంటారు. పుణ్యక్షేత్రం కావడంతో సింహాచల ప్రాంతంలో వివాహ కార్యక్రమాలు కూడా అధిక సంఖ్యలో జరుపుకుంటున్నారు. ఇటువంటి ఎంతో ప్రాముఖ్యత కలిగిన ప్రాంతంలో రాత్రి 8:30 తర్వాత వారి గమ్యస్థానాలు చేరుకునేందుకు సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌కి రాగా ఎటువంటి బస్సు సౌకర్యమూ లేక భక్తులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. గత్యంతరం లేక కొందరు ఆటోలను ఆశ్రయించి అధిక మొత్తంలో డబ్బులు నష్టపోతున్నారు. ఆటోలపై వెళ్లలేని వారు కాంప్లెక్స్‌లోనే నిద్రించి తెల్లవారగానే ఆర్టీసీ బస్సులో ప్రయాణమవుతున్నారు. కాంప్లెక్స్‌లో భక్తులు నిద్రిస్తున్న సమయంలో కొందరు ఆకతాయిలు బ్యాగులు, విలువైన వస్తువులను దొంగిలిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో భక్తులను కాంప్లెక్స్‌లో నిద్రించకుండా బయటకు తరిలిస్తున్నారు. దీనిపై ఆర్టీసీ అధికారులు తగు చర్యలు తీసుకొని రాత్రి 10 గంటల వరకు బస్సు సౌకర్యాన్ని కల్పించాలని భక్తులు కోరుతున్నారు. దీనిపై ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్‌ను ప్రజాశక్తి విలేకరి కలిసి భక్తులు పడుతున్న ఇబ్బందులు, అవసరాన్ని వివరించారు. డిపో మేనేజర్ స్పందిస్తూ సోమవారం జరిగే ఆర్టీసీ అధికారుల సమావేశంలో చర్చించి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తానని చెప్పారు.

బస్సుల్లేక ఇబ్బందులు పడుతున్నాం

రాత్రి 8:30 తర్వాత సింహాచలం నుంచి ప్రయాణం చేయాలంటే బస్సు సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడుతున్నాం. ఆటోలను ఆశ్రయిస్తే అధికంగా వసూలు చేస్తున్నారు. రాత్రి పది గంటల వరకు బస్సు సౌకర్యం కల్పిస్తే ప్రయాణికులకు ఉపయోగంగా ఉంటుంది.

డి.శివాజీ
భక్తుడు

కాంప్లెక్స్‌లోనే బస

సింహాచలం వచ్చే భక్తులకు రాత్రి వేళ బస్సులు లేక ఆ కాంప్లెక్స్‌లోనే బస చేయాల్సి వస్తోంది. రాత్రి అక్కడ ఉంటే ఆకతాయిలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాత్రి 10 గంటల వరకు బస్సులు నడిపితే ప్రయాణికుల అవస్థలు తీరుతాయి.

బంగారురాజు
ట్యాక్సీ డ్రైవర్

అసెంబ్లీలో భీమిలి సమస్యలపై చర్చ

ప్రజాశక్తి-పద్మనాభం : భీమిలి నియోజకవర్గంలోని సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రస్తావించారు. ముందుగా పద్మనాభంలో ఉన్న అనంతపద్మనాభస్వామి కొండపైకి ఘాటు రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని, దేవాలయం అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. పాండ్రంగిలో గోస్తనీ నదిపై వంతెన నిర్మాణానికి రూ.14 కోట్లు మంజూరు చేసినప్పటికీ టెక్నికల్ సమస్యల వల్ల నిర్మాణ జాప్యం అయిందన్నారు. సింహాచలం భూ సమస్యలను పరిష్కరించాలని, దీని కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేయాలని కోరారు.

భూమికి నష్టపరిహారం ఇవ్వాలని ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం : తనకు ఉన్న కొద్దిపాటి భూమికి నష్టపరిహారం ఇవ్వాలని కలెక్టర్‌కు వృద్ధురాలు ఫిర్యాదు చేసింది. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా రెవెన్యూ సిబ్బంది స్పందన లేదని మండలంలోని తునివలస గ్రామానికి చెందిన గుశిడి పైడమ్మ ఆవేదన వ్యక్తంచేసింది. తునివలస గ్రామంలో సర్వే నెంబర్ 46/3 ప్రభుత్వానికి చెందిన భూమిని గత 20 సంవత్సరాలుగా సాగుచేస్తూ జీవిస్తున్నానని, ఆ భూమిని ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ కింద తీసుకుందని, కానీ దానికి తగిన నష్టపరిహారం ఇవ్వలేదని వివరించారు. పద్మనాభం తహశీల్దార్, భీమిలి ఆర్‌డిఒకు, చివరికి స్పందనలో కలెక్టర్‌కు కూడా తన సమస్యను వివరించినా ఎటువంటి చర్యలూ లేవని తెలిపారు. భూమిలో ఉన్న చెట్లను కూడా తొలగించి తనకు ఎటువంటి పరిహారమూ ఇవ్వలేదని విలపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని వృద్ధురాలు కోరారు.

ఆగి ఉన్న వాహనాలను ఢీకొన్న లారీ

ప్రజాశక్తి - ఆరిలోవ : ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆగి ఉన్న వాహనాలను వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొన్న ఘటన హనుమంతవాక సిగ్నల్ పాయింట్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ముందు ఉన్న ఆర్టీసీ బస్సుతో పాటు పక్కనే ఉన్న మూడు ద్విచక్రవాహనాలనూ ఢీకొట్టింది. దీంతో మూడు ద్విచక్ర వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ద్విచక్ర వాహనాలపై ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. గతంలో కూడా ఇదే ప్రదేశంలో సిగ్నల్ వద్ద ఆగి ఉన్న వాహనాలను వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో ముందు ఉన్న వాహనదారులు మృతి చెందిన ఘటనలు రెండు పర్యాయాలు చోటుచేసుకున్నాయి. ఈ సారి స్వల్పగాయాలతో వాహనదారులు బయట పడడంతో అక్కడ ఉన్నవారంతా ఊపిరి పీల్చుకున్నారు.

నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీయన్స్ సమావేశం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీయన్స్ జోన్ -1 సర్వ సభ్య సమావేశం జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏపిఎన్‌జిఒ అధ్యక్ష, కార్యదర్శులు బండి శ్రీనివాసరావు, కె.శివారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపిఎన్‌జిఏఫ్ రాష్ట్ర చైర్మన్ బి.సేవానాయక్ మాట్లాడుతూ, పారా వెటర్నరీయన్స్ కౌన్సిల్ ఏర్పాటుకు రాష్ట్ర క్యాబినెట్, అసెంబ్లీ సమావేశంలో ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న విఎల్‌ఒ పోస్టుకు గెజిటెడ్ హోదా కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎల్ఎస్ఏ అధ్యక్షులు బి.గోవిందరాజు, ట్రెజరర్ కోదండరావు, నాయకులు ఎస్.అప్పారావు, గోవిందరావు, నాయుడు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి పైడిరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానికంగా యూనియన్ జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానం వల్ల పేదలకు విద్య దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు న్యాయం చేయాలని, కోవిడ్‌లో మృతి చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలను ఆదుకోవాలని, ఆయా కుటుంబాల్లో ఉన్న వారికి కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

హోమియో మందుల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్విర్ల శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన బజారులోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. వైద్యులు టి.జగన్నాధరావు, టిజె.మోహన్ పలువురిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీ రావు, కె.శ్రీనివాసరావు సభ్యులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి- కంచరపాలెం : అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన ఘటన కంచరపాలెం కప్పరాడ అశోక్ నగర్ వద్ద ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి కంచరపాలెం సిఐ ఎస్.విజయ్ కుమార్ కథనం ప్రకారం... అశోక్‌నగర్‌లో నివాసముంటున్న శాంతి (35) ఇషాక్ దంపతులు నివసిస్తున్నారు. వీరికి ఆరేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు సంతానం ఉన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఇంటి మేడ పైకి వెళ్లిన శాంతి మూడంతస్తుల భవనం పైనుంచి పక్కన ఉన్న మరో భవనంపై పడి మృతిచెందింది. ఆమె కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. ఆమె ఆత్మహత్యకు పాల్పడిందా, ప్రమాదవశాత్తు మృతి చెందిందా తెలియాల్సి ఉంది.

సచివాలయం ముందు వర్షపు నీరు

ప్రజాశక్తి -పద్మనాభం : మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని బి.తాళ్లవలస సచివాలయం ముందు నీరు నిల్వచేరింది. సచివాలయం ఉన్న వీధి లోతట్టుగా ఉండటంతో వర్షపు నీరు అక్కడే ఉండిపోతోంది. దీంతో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నీటిని తొలగించడానికి సచివాలయ అధికారులు ఎటువంటి చర్యలూ చేపట్టడంలేదని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోరాడు రమణ పేర్కొన్నారు. ప్రధాన రహదారి కావడంతో వాహనాలతో పాటు స్థానికులు కూడా అదే రోడ్డు గుండా ప్రయాణం చేస్తుంటారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై నిల్వ చేరిన నీరుపోయేలా చేపట్టాలని ఆయన కోరారు.

గ్రామ సచివాలయం ముందు చేరిన నీరు

కోతుల సంచారంతో భయాందోళన

ప్రజాశక్తి- కంచరపాలెం : జీవీఎంసీ 57వ వార్డు పరిధి మర్రిపాలెం, రామనాయుడుకాలనీ, శ్యామనగర్ ప్రాంతాలలో కోతిమూకల సంచారంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆ ప్రాంతాల్లో కోతులు గుంపుగా వచ్చి రోడ్లపై నడిచి వెళ్లే వారిపైనా, ద్విచక్ర వాహనదారులపైనా, ఇళ్లలోనూ చొరబడి మనుషులపై దాడి చేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కోతుల సంచారంతో బయటకు వెళ్లలేక, తలుపులు మూసుకొని ఉంటున్నామని చెబుతున్నారు. ఆరుబయట ఆడుకునే పిల్లలపైనా దాడి చేసి గాయపరుస్తున్నాయని తెలిపారు. కోతులు ఇంత సమూహంగా రావడం ఎప్పుడూ చూడలేదని, ఇటీవల చాలా ఎక్కువైపోయాయని పేర్కొన్నారు. ఇళ్ల పరిసరాల్లోని చెత్త డబ్బాలను కింద పడేసి పరిసరాలను చిందర వందర చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవిఎంసి అధికారులు దృష్టి సారించి కోతుల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంటిలోకి చొరబడుతున్న కోతి

సూర్యనారాయణ మృతి తీరని లోటు : జెవి

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సిపిఐ సీనియర్ నాయకులు కానూరి సూర్యనారాయణ మృతి తమ పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి అన్నారు. చిట్టివలస కార్మిక సంక్షేమ భవనంలో సూర్యనారాయణ సంస్మరణ సభను ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. అనంతరం జెవి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ, పార్టీ, చిట్టివలస లేబర్ యూనియన్‌లో సూర్యనారాయణ క్రియాశీలకంగా పని చేశారని తెలిపారు. పార్టీ నాయకులు అల్లు బాబూరావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ, ఎఐటియుసి నాయకులు కొండపు ఈశ్వరరావు, కానూరి రాంబాబు, మాజీ కౌన్సిలర్ టి.సోమరాజు, ఎం.వీర్రాజు, దుంప శ్రీనివాసరావు, ఎస్‌టియు నాయకులు ఇ.పైడిరాజు, సూర్యనారాయణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యతో పాటు శుభ్రతపై అవగాహన

పట్టాలందుకున్న విద్యార్థులతో అతిథులు

ప్రజాశక్తి- గాజువాక : చిన్నప్పటి నుంచి పిల్లలకు విద్యతోపాటు శుభ్రతపై అవగాహన కల్పించాలని ఎంహెచ్‌ఒ డాక్టర్ సుంకర కిరణ్ కుమార్ సూచించారు. జీవిఎంసి 85వ వార్డు పరిధి కొండయ్యవలస ఉన్న విజ్ఞాన్ బ్రిలియంట్ స్కూల్‌లో యుకెజి నుంచి ఒకటో తరగతికి వెళ్లే విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా డాక్టర్ సుంకర కిరణ్ కుమార్ హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను పాఠశాలల్లో వెలికితీయాలన్నారు. పిల్లల పౌష్టికాహారంపై తల్లిదండ్రులు దృష్టిసారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ బ్రిలియంట్ స్కూల్ కరస్పాండెంట్ కెవి.సత్యనారాయణ, బీవీ రామారావు, పాఠశాల ప్రిన్సిపల్ కె.పద్మావతి, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి సీతారాం, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎస్‌వికె.పరశురాం, మాస్టర్ మైండ్ స్కూల్ కరస్పాండెంట్ ఎం.రంగనాథ్, ఎడిసి డైరెక్టర్ తోకాడ రాము పాల్గొన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాము

టూ వీలర్ మెకానిక్‌లను అసంఘటిత రంగ కార్మికులుగా గుర్తించాలి

ప్రజాశక్తి -గాజువాక : టూ వీలర్ మెకానిక్‌లను అసంఘటిత రంగ కార్మికులుగా గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.రాము రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గాజువాకలో ఆదివారం ప్రగతి టూ వీలర్ మెకానిక్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, అసోసియేషన్ సహకారంతో రాష్ట్ర స్థాయి సంఘంలో సభ్యత్వం తీసుకొని గుర్తింపు కార్డులు పొందాలన్నారు. దీని ద్వారా మెకానిక్‌లకు అనేక ఆర్థిక ప్రయోజనాలు అందుతాయని తెలిపారు. టూ వీలర్ మెకానిక్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి అప్పారి విష్ణుమూర్తి మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికులకు వర్తించే అన్ని పథకాలను టూ వీలర్ మెకానిక్‌లకు వర్తింప చేయాలని కోరారు. అసోసియేషన్ బలోపేతానికి మెకానిక్‌లంతా అండగా నిలవాలన్నారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామును సత్కరించారు. ఈ సమావేశంలో స్థానిక అసోసియేషన్ అధ్యక్షుడు జి.దామోదర్‌రావు, వంగపండు గణేష్ , రెడ్డిపల్లి రాజు, జి.వెంకటేశ్వరరావు, చంటి, సోమేష్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న సాంస్కృతిక సంబరాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : మల్లికా మాధుర్య స్వరాలు కల్చరల్ అసోసియేషన్ పంచమ వార్షికోత్సవం సందర్భంగా ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సాంస్కృతిక సంబరాలు ఆకట్టుకున్నాయి. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న కళా సేవకులను సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు నన్నపనేని మల్లికా చౌదరి నేతృత్వంలో సత్కరించారు. కార్యక్రమంలో కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ బంగారి వెంకటేశ్వరరావు, రైటర్స్ అకాడమి ఛైర్మన్ వివి రమణమూర్తి, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, వ్యాఖ్యాత పి.రాజేంద్రప్రసాద్, సినీ నటుడు ఆర్.యాదకుమార్, కళా రంగ ప్రతినిధులు మహ్మద్‌ఖాన్, చెన్నా తిరుమలరావు, మస్తాన్‌రెడ్డి, సన్‌మూర్తి, జెఎంఆర్ నెహ్రూ తదితరులు ప్రసంగించారు. తొలుత జరిగిన సంగీత విభావరిలో కెఎస్.ప్రకాష్, మల్లిక పాడిన ఈమూగ చూపేలా, రైల్వే రమణ, మల్లిక పాడిన చల్లని గాలి, చంద్రశేఖర్ పాడిన రింజిమ్ రింజిమ్ హైదరాబాద్, బొమ్మిడి సత్యనారాయణ, శ్వేత పాడిన దంచవే మేనత్త కూతురా, సింహాచలం, మల్లిక పాడిన ఒక్క సారి చెప్పలేవా వంటి గీతాలు ఆహూతులను అలరించాయి.

నమ్మి రామును సన్మానిస్తున్న యాదవ పెద్దలు

నమ్మి రాముకు సన్మానం

ప్రజాశక్తి - ములగాడ: హిందుస్థాన్ పెట్రోలియం బాట్లింగ్ ప్లాంట్‌లో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన నమ్మి రామును మల్కాపురం యాదవ్ ప్రతినిధులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా యాదవ కుల ప్రతినిధులు మాట్లాడుతూ, యాదవ సంఘంలో వివిధ కార్యక్రమాలను నమ్మి రాము ముందుండి చేసేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు పంచదారల ఎల్లారావు, ఊరుకోటి చెన్నారావు, నూనెల అప్పలరాజు, ఎన్‌వి.రమణ, చట్టి నూకరాజు, ఊరుకోటి వెంకటరావు, నూనెల రాజు, నూనెల పైడిరాజు, పిల్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రహదారులు జలమయం

కాలువలు, గెడ్డలను ఆక్రమిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు
చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఇటీవల కురిసిన వర్షానికి కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే ప్రధాన రహదారిలో నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. కొన్ని దశాబ్దాలుగా మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్ కాలువల ద్వారా వచ్చే నీరు దిగువ ఉన్న గెడ్డలు, కల్వర్టుల ద్వారా ప్రవహించేది. ఇటీవల అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కాలువలను, గెడ్డలను కప్పేశారు. దీంతో నీరు ప్రవహించే మార్గం లేక రహదారి మొత్తం జలమయంగా మారుతోంది. గత వర్షాకాలంలో ఈ ప్రాంతం ముంపునకు గురికావడంతో అధికారులు స్పందించి గెడ్డల్లో పూడికలను తొలగించి నీటి ప్రవాహానికి మార్గం సుగమనం చేశారు. ఇక్కడ అపార్ట్‌మెంట్లు నిర్మాణం చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ ప్రధాన కాలువ తమ నిర్మాణాలకు అడ్డంగా నిలిచిందని పూడ్చేశారు. దీంతో నీరు పోయే మార్గం లేక రహదారి మొత్తం జలమయంగా మారుతోంది. దశాబ్దాలుగా నీరు ప్రవహించే కాలువలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎలా కప్పేస్తారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి ఆక్రమణదారులకు అపార్ట్‌మెంట్ నిర్మాణానికి జివిఎంసి ఎలా అనుమతులు ఇచ్చిందని ప్రశ్నిస్తున్నారు. దీనిపై 88వ వార్డు పరిధి నరవకు సంబంధించిన జనసేన నాయకుడు ఒబ్బిన జనార్ధన శ్రీకాంత్ కార్యకర్తలు ఆందోళనలు దిగారు. ఈ నీటి ప్రవాహానికి మార్గం చూపించాలని అధికారులను కోరారు.

కాలువలు, గెడ్డలను ఆక్రమించేయడంతో పొంగి ప్రవహిస్తున్న మురుగు నీరు

నరవ ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న నీరు

సచివాలయ విఆర్‌ఒల కనుసన్నల్లోనే...

ఆక్రమణల జోరు?

ప్రజాశక్తి-పెందుర్తి : ప్రభుత్వ స్థలాల్లో ఏ చిన్నపాటి నిర్మాణం జరిగినా రెవిన్యూ సిబ్బంది క్షణాల్లో వాలిపోయేవారు. మండలంలోని వేపగుంట రెవెన్యూ పరిధి చినముసిడివాడ, పెందుర్తిలో వందల ఎకరాల్లో ప్రభుత్వ స్థలం ఉంది. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత ఏమాత్రం ఆక్రమణ జరిగినా తహశీల్దార్లకు సీనియర్ విఆర్‌ఒలు సమాచారమిచ్చేవారు. గత తహశీల్దార్‌గా బాబ్జి ఉండేటప్పుడు ఏ మాత్రం ఆక్రమణ జరిగినా సంబంధిత సచివాలయ విఆర్‌ఒలను పిలిపించి మెమోలు జారీ చేస్తూ హెచ్చరించేవారు. దీనివల్ల కింది నుంచి పైస్థాయి సిబ్బంది వరకు అందరూ భయపడి పని చేసేవారు.

సచివాలయ విఆర్‌ఒలు ఉద్యోగాల్లో చేరి మూడేళ్లు పూర్తయింది. ప్రొహిబిషన్ పీరియడ్ పూర్తి కావడంతో పలు చోట్ల వారు జూలు విదిలిస్తున్నారు. సచివాలయ విఆర్‌ఒ కనుసన్నల్లోనే ఆక్రమాలు జరుగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఉన్న రెవెన్యూ బోర్డులను తొలగించి నిర్మాణాలు చేపట్టారు. ఇదంతా సచివాలయ విఆర్‌ఒ కనుసన్నల్లోనే కొనసాగుతుందని, బంజర్ భూములకు పట్టాలు ఉన్నాయని సృష్టించి నిర్మాణదారులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సచివాలయ వ్యవస్థ తెచ్చి పారదర్శక పాలన అందిస్తున్నానని జగన్మోహన్‌రెడ్డి పదేపదే చెబుతున్నా అందుకు భిన్నంగా ఇక్కడ ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భూ ఆక్రమణలపై సమగ్ర విచారణ జరపాలని పలు కాలనీల వాసులు కోరుతున్నారు.

శిల్పారామంలో వాణిజ్య ప్రదర్శన

ప్రజాశక్తి -పిఎం పాలెం : జి-20 భావనను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నాల్లో భాగంగా మధురవాడ శిల్పారామం వేదికగా చిన్న పారిశ్రామికవేత్తల ప్రయోజనం కోసం 3 రోజుల వాణిజ్య ప్రదర్శనను భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఏర్పాటు చేసింది. ఆర్‌బిఐ జనరల్ మేనేజర్, ఎపి రీజినల్ ఆఫీస్ ఇన్‌ఛార్జి అంజని మిశ్రా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. దాదాపు 70 మంది స్టాళ్లను ఏర్పాటుచేసి చేనేత వస్త్రాలు, చేతితో తయారుచేసిన బొమ్మలు, సేంద్రీయ ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జెంటిల్ మేనేజర్ ఆర్‌కె.హమ్ముఖ కుమారి, మేనేజర్ పూర్ణిమ, ఆర్‌బిఐ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అచ్చన్నాయుడు పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి -యంత్రాంగం

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చన్నాయుడు పుట్టిన రోజు వేడుకలను ఆదివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.

భీమునిపట్నం : స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజక వర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు కె.దామోదరరావు, వానపల్లి సత్య, టి.సూరిబాబు, గరే సదానంద, కనకల అప్పలనాయుడు, గిడుతూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : గాజువాక టిడిపి కార్యాలయంలో నియోజవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ ఆధ్వర్యాన కేక్ కట్ చేశారు. నాయకులు, కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పూర్వవైభవానికి అచ్చన్నాయుడు పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు విల్లా రామ్మోహన్‌కుమార్, టిఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షులు ఎస్.రతన్‌కాంత్, పార్టీ కార్యదర్శులు గంతకోరు అప్పారావు, సింగూర్ అనంత్, నామాలు పెంటయ్య, వియ్యపు కొండబాబు, గోమాడ వాసు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం: అచ్చన్నాయుడు జన్మదినం సందర్భంగా సింహాచలం తొలి పావంచా వద్ద విశాఖ పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పాసర్ల ప్రసాద్, 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షులు పంచదార శ్రీనివాసరావు, సిరిపురం సురేష్, రాజనాల సత్యారావు, బంతి శ్రీను, గుసిడి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదినం సందర్భంగా ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగ జగదీశ్వరరావు, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో వేర్వేరుగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నాగ జగదీష్ ఆధ్వర్యంలో పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పీలా గోవింద ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో మళ్ల సురేంద్ర, కొణతాల రత్నకుమారి, బిఎస్ఎన్ఎ జోగినాయుడు, పెనుమత్స సాయిరాజ్, కోట్ని రామకృష్ణ, బోడి వెంకటరావు, బొడ్డేడ మురళి, మళ్ల గణేష్, దూలం ప్రసాద్, పోలవరపు త్రినాథ్, సబ్బవరం గణేష్ పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న కోరాడ రాజబాబు


పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాగ జగదీష్

5న చలో ఢిల్లీని విజయవంతం చేయండి

అనకాపల్లిలో మాట్లాడుతున్న లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్రంలో బిజెపి ప్రభుత్వ ప్రజా కార్మిక కర్షక వ్యతిరేక విధానాలపై ఏప్రిల్ 5న చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు అధ్యక్షతన సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ, తొమ్మిదేళ్ల బిజెపి పాలనలో దేశంలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయన్నారు.. కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ కంపెనీలకు బిజెపి దాసోహమైందన్నారు.

దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతూ ప్రజలపై పన్నులు, ధరల భారాలు వేస్తూ జీవనం దుర్భరం చేస్తున్నారన్నారు. బిజెపి వ్యవసాయ కార్మికులు, రైతులు, నిరుద్యోగులు దుర్భర పరిస్థితులు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.దీనిపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు మాట్లాడుతూ సంస్కరణల పేరుతో విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసిన కేంద్ర ప్రభుత్వం, రైతులను నిలువునా ముంచేసిందని మండిపడ్డారు. కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ కౌలు రైతుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి వెంకన్న మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో రూ.30 వేల కోట్ల కోత విధించి, వ్యవసాయ కార్మికుల ఉపాధిని హరించిందని మండిపడ్డారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ర్తుల శంకరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం. సత్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాము, జి వరలక్ష్మి వి సత్యవతి, ఉమా, నారాయణమ్మ, వివి శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, రొంగలి రాము పాల్గొన్నారు.

కశింకోట: 5న చలోఢిల్లీ విజయవంతం చేయాలని కోరుతూ కశింకోటలో సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, రైతుల, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టే ఆందోళనలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. డి.వరలక్ష్మి, ఎం. శ్రీదేవి, కె. శాంతి, ఆర్.అమ్మాజీ, దాకారపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తగరపువలస : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక, కర్షక హక్కుల కోసం ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద ఆదివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ, సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుల సంఘం ఆధ్వర్యాన చేపట్టే చలో ఢిల్లీని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎస్‌ను రద్దుచేయాలని, ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, కనీస పింఛను రూ.10 వేలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, డి.బాబాజీ, ఎం.ఈశ్వరరావు, కర్రి రాము తదితరులు పాల్గొన్నారు.

కశింకోట, తగరపువలసల్లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నేతలు

బ్రాండిక్స్ ఆధ్వర్యంలో 475 మందికి ఉచిత కంటి పరీక్షలు

రోగులకు కంటి అద్దాలిస్తున్న దొరస్వామి, మణిమాల

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 103వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 15మంది చిన్నారులతో సహా 475 మంది కంటి రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిచారు. సాధారణ చికిత్సలతో పాటుగా 356 మందికి ఉచితంగా కంటి అద్దాలను అందించారు. 105 మందికి మందులు పంపిణీ చేశారు. 30 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపికచేశారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు మజ్జిగ, తాగునీరు, భోజనం ఉచితంగా అందించారు. కంటి వైద్య శిబిరాన్ని శంకర్ ఫౌండేషన్ పూర్వ సిఇఒ మణిమాల రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. .బ్రాండిక్స్ సేవలను కొనియాడారు.బ్రాండిక్స్ పార్టనర్ దొరస్వామి పాల్గొన్నారు.

దేవరాపల్లిలో అమ్మ ట్రస్ట్ ఆధ్వర్యాన....

రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని వేచలం గ్రామంలో ఆదివారం అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతోఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్యశిబిరాన్ని ట్రస్ట్ సభ్యులు కె. వెంకటరావు ప్రారంభించగా, 110 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు 53 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు వైద్య శిబిరంలో వైద్యాధికారి పి దివ్య, వైద్య సిబ్బంది రోగులకు సేవలు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సటార్ నాయుడు, ఎంపిటిసి రెడ్డి లక్ష్మి, రెడ్డి బలరాం, నగేష్, వి.నరసింహ నాయుడు, రామకృష్ణ, రెడ్డి శ్రీను, లెక్కల సత్యనారాయణ, క్యాంపు కోఆర్డినేటర్ వై పైడిరాజు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

55ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక గవరపాలెం మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో 1968 69 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం పాఠశాలలో జరిగింది. తాము పాఠశాలలో 10వ తరగతి చదివి 55 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఈ ఆత్మీయ కలయిక జరిగినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బుద్ధ శివాజీ, కెయం నాయుడు, రేలంగి సూర్య ప్రకాశరావు, కుందు తులసీరామ్, ఎంబివి స్వామి, బుద్ధ వీరునాయుడు పాల్గొన్నారు.

'రైవాడ' జోలికొస్తే ఊరుకోం

రిజర్వాయర్ వద్ద టిడిపి నిరసనలో మాట్లాడుతున్న రామానాయుడు

ప్రజాశక్తి- దేవరాపల్లి : రైవాడ జలాశయం జోలికొస్తే చూస్తూ ఊరుకోబోమని మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు హెచ్చరించారు. ఆదివారం టిడిపి నేతలతో కలిసి రిజర్వాయర్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ఎగువన మన్యంలో హైడ్రోపవర్ ప్రాజెక్టును నిర్మించతలపెట్టి, వాటి బాధ్యతలను అదానీ, షిరిడిసాయి సంస్థలకు కట్టబెట్టిన ప్రభుత్వం, ఆయా ప్రాజెక్టులకు రైవాడ జలాశయ నీటిని కేటాయించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే చివరి ఆయకట్టుకు నీరు అందించలేని స్థితిలో ఉన్న రైవాడ జలాశయ నీటిని హైడ్రో ప్రాజెక్టులకు మళ్లిస్తే, ఆయకట్టుకు సాగునీరు ప్రశ్నార్థకమౌతుందని, రైతులు తీవ్రంగా నష్టపోక తప్పదని ఆవేదన వ్యక్తం చేశారు. రైవాడ రిజర్వాయర్ కింద 15వేల ఎకరాల ఆయకట్టు ఉంటే, అదనంగా మరో ఆరువేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించి, సాగునీటిని అందిస్తామని హామీఇచ్చిన వైసిపి ప్రభుత్వం హామీ నెరవేర్చకపోగా ఇపుడు ఉన్న నీటిని లాక్కోవడం భావ్యం కాదన్నారు. ప్రైవేట్ ప్రాజెక్టులకు జలాశయాలను అప్పగిస్తే రైతు ఉద్యమం తప్పదని హెచ్చరించారు. తాండవ, రైవాడ జలాశయాల పరిరక్షణ, అభివృద్ధికి ఆయకట్టు రైతాంగంతో కలిసి పోరాడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, శరకాల సూర్యనారాయణ పార్టీ సీనియర్ నాయకులు కరుణాకరరావు, గొర్లె దేవుళ్లు, పార్టీ నేతలు అధికసంఖ్యలో పాల్గొన్నారు

ధర లేక రైతుల 'చింత'

దేవరాపల్లి వారపుసంతకు అమ్మకానికి తెచ్చిన చింతపండు

ప్రజాశక్తి- దేవరాపల్లి : దేవరాపల్లిలో ఆదివారం నిర్వహించే వారపు సంతలో చింతపండుకు ధర లేక రైతులు దిగాలు పడ్డారు. ఈ సీజన్లో చింతపండు దిగుబడి తక్కువగా ఉన్నప్పటికీ, చింతపండుకు గిట్టుబాటు ధర రాకపోవడం పట్ల చింత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు ముందు కిలో చింతపండు రూ.60 నుంచి రూ.65కు విక్రయించగా, ఇపుడు రూ.40 కూడా పలకడం లేదని రైతులు వాపోతున్నారు. దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, సిండికేట్‌గా మారి, చింతపండుకు ధర లేకుండా చేస్తున్నారని, దళారులే తక్కువ ధరకు కొనుగోలు చేసి కోల్డ్ స్టోరేజ్‌లకు పంపిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. దళారుల వల్లే చింతపండుకు గిట్టుబాటు లభించడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టడం ద్వారా గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని చింత రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వాల విధానాలతో ప్రాథమిక విద్య నిర్వీర్యం

ప్రజాశక్తి -అనకాపల్లి : నూతన విద్య విధానం పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రాథమిక విద్యావ్యవస్థ పతనమవుతోందని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి డివి రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక గవరపాలెం మల్ల జగన్నాథం కళ్యాణ మండపంలో ఆదివారం యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ ప్రథమ సమావేశం జరిగింది. ముందుగా యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ విద్యారంగంలో ప్రభుత్వాలు తీసుకుంటున్న తిరోగమన చర్యలను రాష్ట్రంలో ఉపాధ్యాయులు నిత్య చైతన్యవంతులై ఉండి ఖండించాలన్నారు. సిపిఎస్ రద్దుపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలు చేయాల్సిందేనని, ప్రత్యామ్నాయం కాకుండా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించడం విద్యా హక్కు చట్టానికి విరుద్ధమన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాఘవులు

నూతన కార్యవర్గం ఎన్నిక

జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీలక్ష్మి, చిన్నబ్బాయి

యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా నెల్లి సుబ్బారావు, అధ్యక్షురాలిగా వత్సవాయి శ్రీలక్ష్మి, సహాధ్యక్షులుగా కట్ట శ్రీనివాసరావు, జివిపిఎస్ లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా గొంది చిన్నబ్బాయి, కోశాధికారిగా జెవిఎస్‌పి రాజేష్, కార్యదర్శులుగా గుత్తుల సూర్య ప్రకాష్, కాలింగ సతీష్, పోలిమేర చంద్రరావు, దొగ్గ శ్రీనివాస్, వి రమేష్ బాబు, వి చైతన్య శీల, ఎన్ శేషుకుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా అడిగర్ల శ్రీనివాస్, ఆడిట్ కమిటీ సభ్యులుగా కె.రామచంద్రరావు, జి శాంతిదేవి, కొపెర్తి శ్రీను, ఆర్.రవికుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ డిమాండ్ల సాధనకు యుటిఎఫ్ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వంపై నిరంతర పోరాటం చేస్తామన్నారు. ఉపాధ్యాయులంతా ఐక్యంగా కలిసి రావాలన్నారు. నూతన కమిటీని అభినందించారు.

తులసీరావు ఆశయ సాధనకు కృషి

మాట్లాడుతున్న డెయిరీ చైర్మన్ ఆనందకుమార్

ప్రజాశక్తి- సబ్బవరం :ఆంధ్ర కురియన్‌గా, క్షీర విప్లవనేతగా విశాఖ డెయిరీ అభివృద్ధికి కృషి చేసిన తన తండ్రి ఆడారి తులసీరావు బాటలోనే నడుస్తూ, ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తానని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని ఇరువాడ, ఆరిపాకల్లో బల్క్ మిల్క్ కూలింగ్ పాయింట్ల వద్ద ఏర్పాటు చేసిన ఆడారి తులసీరావు విగ్రహాలను ఆవిష్కరించారు. పెద యాతపాలెంలో విశాఖ డెయిరీ నిధులు రూ.35 లక్షలతో నిర్మించిన తులసి ఆనంద కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాఖ డెయిరీ డైరెక్టర్ శరగడం శంకరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పాడిరైతుల సంక్షేమమే ధ్యేయంగా తన తండ్రి పనిచేశారన్నారు.రోజుకు పది లక్షల లీటర్ల పాల ఉత్పత్తి లక్ష్యంగా విశాఖ డెయిరీ ముందుకు సాగుతోందని, దానికి రైతులు సహకరించాలని కోరారు. ప్రతి రైతూ పదిలీటర్ల పాలు పంపిణీ చేసేలా సభ్యరైతులకు ఆవులను డెయిరీ ద్వారా పంపిణీ చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. డెయిరీ సభ్యరైతుల కుటుంబాలకు కృషి ఐకాన్‌లో వైద్యం, ఇతర సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.కార్యక్రమంలో డెయిరీ ఎండి ఎస్‌వి.రమణ, డిజిఎం. డాక్టర్ పాండ్యరాజన్, మేనేజర్ ప్రభాకర్, డైరెక్టర్లు మలసాల రమణారావు, చిటికెల రాజకుమారి, ఆడారి విజయలక్ష్మి, కోళ్ల కాటమయ్య, రెడ్డి రామకృష్ణ, గేదెల సత్యనారాయణ, శీరం రెడ్డి సూర్యనారాయణ, సుందరపు గంగాధర్, ఎంపిడిఒ రమేష్ నాయుడు, పలువురు పాలసొసైటీ అధ్యక్షులు, సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీల పేరుతో భూమాయ

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా

ప్రజాశక్తి -అనకాపల్లి : జగనన్న కాలనీల పేరుతో వైసిపి ప్రభుత్వం భూమాయ చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. ఆదివారం మండలంలోని గొలగాం గ్రామంలో జగనన్న కాలనీలను పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న కాలనీల పేరుతో రాష్ట్రంలో 20 లక్షల పక్కాఇళ్లుఎక్కడ నిర్మించారో చెప్పాలని ప్రశ్నించారు. ఉన్న జగనన్న కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు లేక ఇళ్లను నిర్మించే పరిస్థితి లేదన్నారు. అక్కడక్కడా చేపట్టిన నిర్మాణాల నాణ్యత తీసికట్టుగా ఉందన్నారు .గత ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లను పేదలపై కక్షతోనే నేటికీ పంపిణీ చేయలేదన్నారు. జగనన్న కాలనీల నిర్మాణంపై కలెక్టర్ విజిలెన్స్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తలారి కాశి నాయుడు, చీకటి రాంబాబు, శలపురెడ్డి శ్రీను, మింది రాము, తలారి నూకరాజు, నారపిన్ని రమణ అప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థి జీవితానికి పదో తరగతి పునాది

మాట్లాడుతున్న ఎడిఆర్ డాక్టర్ జగన్నాథ రావు

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యార్థి జీవితంలో అనుకున్నది సాధించేందుకు పదవ తరగతి పునాది వంటిదని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకులు డాక్టర్ పివికె. జగన్నాథరావు అన్నారు. స్థానిక బిసి గురుకుల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో మాట్లాడుతూ పదవ తరగతితోనే చదువును ఆపేయకుండా ఉన్నత చదువులు అభ్యసించి భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని మంచిగ్రేడింగ్‌తో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కర్రి గంగాధరరావు పాల్గొన్నారు.

ఐదుగురికి జాతీయ ప్రతిభ స్కాలర్‌షిప్

ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం

ప్రజాశక్తి- సబ్బవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐదుగురు 8వ తరగతి విద్యార్థులు జాతీయ స్థాయి ప్రతిభ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని ఇన్‌ఛార్జి హెచ్ఎం సిహెచ్ చిన్నమ్మాయి తెలిపారు ఫిబ్రవరి 5న జాతీయ స్థాయిలో జరిగిన నేషనల్ మీన్స్ కం మెరిట్ పరీక్షల్లో నక్క సత్యప్రసాద్ (107), మారడబూడి టీన్స్ ప్రియ(102), కోతల చరిష్మా (99), నక్క సాలోమి ఫ్లోరెన్స్ (89), గంపరాయి కీర్తి (75) ప్రతిభ కనబరిచారన్నారు. వీరికి ఇంటర్మీడియేట్ వరకు ఏడాదికి రూ.12వేలు చొప్పున కేంద్ర ఉపకార వేతనం అందుతుందన్నారు. ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను ఎంఇఒ ఎస్.అప్పలరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు అభినందించారు.

29న ఊరూరా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

కేక్ కట్ చేస్తున్న చలపతిరావు, నాగేశ్వరరావు

ప్రజాశక్తి- యలమంచిలి : ప్రజల్లో మార్పు మొదలైందని, తెలుగుదేశం కార్యకర్తలంతా అప్రమత్తతతో వ్యవహరించి గ్రామగ్రామాన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని యలమంచిలి నియోజకవర్గ నేతలంతా ముక్తకంఠంతో నిర్ణయించారు. ఆదివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ సమావేశానికి అధ్యక్షత వహించిన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ టిడిపికి ప్రజాదరణ ఎప్పుడూ ఉందని, పార్టీ కేడర్ ఉత్సాహంగా పనిచేయాలన్నారు. ఈ నెల 29న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఊరూరా పసుపు జెండాలు ఎగరాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంఎల్‌సి పప్పల చలపతిరావు మాట్లాడుతూ రానున్న రోజులు తెలుగుదేశం పార్టీవేనని, 2024లో విజయం సాధించి ప్రభుత్వాన్ని స్థాపిస్తామని భరోసా ఇచ్చారు. పార్టీ రాష్ట్రకార్యదర్శి ధూళి రంగనాయకులు, జిల్లా ఉపాధ్యక్షులు కొలకలూరి విజయబాబు, జిల్లా కార్యదర్శి రాజాన సూర్య నాగేశ్వరరావు, పూడిమడక మాజీ సర్పంచ్ మేరుగు బాపునాయుడు, జనపరెడ్డి నరసింగరావు, గొర్లె నానాజీ, ఇత్తంశెట్టి రాజు, వసంతవాడ దిన్‌బాబు, దొడ్డి శ్రీనివాసరావు, రాజాన నానాజీ, బొద్దపు రమణ, ఆడారి ఆదిమూర్తి, పెయ్యల రామకృష్ణ, సుబ్బయ్యనాయుడు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ ఎంపీ సభ్యత్వం రద్దుపై నిరసన

గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వం రద్దును నిరసిస్తూ ఆదివారం అనకాపల్లి కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ముందుగా గాంధీ విగ్రహానికి ఎపిసిసి సభ్యులు మీసాల సుబ్బన్న, అనకాపల్లి నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు మలపురెడ్డి కోటేశ్వరరావు పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ బిజెపి నియంతృత్వ ప్రజావ్యతిరేక విధానాలను, ఆదానీలకు ప్రజల సొత్తు దారాదత్తం చేయడాన్ని ప్రశ్నించడంపై కక్షసాధింపుగా ఇలాంటి చర్యలుక పాల్పడుతోందన్నారు. పార్టీ న్యాయ విభాగం జిల్లా అధ్యక్షులు సురా శ్రీనివాస్, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోయిన భానుమూర్తి యాదవ్, నాయకులు కత్తెర శ్రీధర్, ఆర్ఆర్ నాయుడు విన్నకోట రాము, సేనాపతి ఈశ్వరరావు, మాడిపు నాయుడు,వాయిబోయిన రాజు, బాలమురళి పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు యలమంచిలి క్రీడాకారులు

ప్రజాశక్తి -యలమంచిలి : ఈ నెల 28 నుండి31 వరకు రాజస్థాన్‌లోని కోట యూనివర్సిటీలో జరగనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన యలమంచిలి క్రీడాకారులు ఆదివారం బయలుదేరి వెళ్లారని తైక్వాండో కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించిన వట్టి సౌజన్య, మురుకుర్తి హర్షిత జాతీయజట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. క్రీడాకారులను న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.అచ్యుతరెడ్డి, యలమంచిలి తైక్వాండో క్లబ్ గౌరవాధ్యక్షులు నగిరెడ్డి దొరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ములంపాక అచ్చంనాయుడు తదితరులు అభినందించి, పతకాలతో రావాలని ఆకాంక్షించారు.

ఘనంగా మోదకొండమ్మ తీర్థం

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో రాజువారి కల్లాల వద్ద ఆదివారం మోదకొండమ్మ తీర్థం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం అదే గ్రామ మహిళల చిడతలు భజన ఆకట్టుకుంది. సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, వైసిపి మండల నాయకులు దాట్ల శివాజీ రాజు, ఎంపిటిసి ఏటుకూరు రాజేష్, సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజీ శ్రీనివాసరావు, కోఆపరేటివ్ బ్యాంకు మాజీ చైర్మన్ రాజీ మోదినాయుడు పాల్గొన్నారు.

నవోదయ మోడల్ పరీక్ష నిర్వహణ

ప్రజాశక్తి -వడ్డాది : వడ్డాది శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన నవోదయ మోడల్ టెస్ట్‌కు 200 మంది పైగా విద్యార్థులు పాల్గొని పరీక్ష రాశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సిహెచ్ రాంబి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు నవోదయ, సైనిక్ స్కూల్ ప్రవేశపరీక్షలపై అవగాహన కల్పించేందుకు ఇలా నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

ఇంటి పిచ్చుకలను సంరక్షించుకుందాం

ప్రజాశక్తి -అనకాపల్లి : ఇంటి పిచ్చుకలను మనమే సంరక్షించు కోవడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.రవిబాబు అన్నారు. ఆదివారం నెహ్రూ చౌక్ జంక్షన్‌లో గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో పక్షులకు తిండి గింజలు, తాగునీరు పెట్టేందుకు మట్టి పాత్రలు, మట్టి గూళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన రవిబాబు మాట్లాడుతూ గ్రీన్ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతి ఒక్కరు జీవవైవిధ్యాన్ని, ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు కృషి చేయాలన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, వక్షమిత్ర కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ రూపొందించిన 'చేయి చేయి కలుపుదాం.. పిచ్చుక సంతతిని కాపాడుకుందాం' అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ, బేతాళం శేషసాయి, విశ్రాంత అటవీ శాఖ అధికారి బీర వినోద్‌కుమార్, కశింకోట ఎంపిడిఒ అప్పారావు, ఎస్ సత్తిబాబు, కర్రి హనుమంతరావు, యుగేష్, రెడ్డి కృష్ణ, వై చక్రవర్తి పాల్గొన్నారు.

పూల సాగుతో అధికాదాయం

మల్లె తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్

ప్రజాశక్తి -యలమంచిలి : వరి, చెరకు వంటి సాంప్రదాయ పంటలకు బదులుగా అధిక లాభాలిచ్చే పండ్లు, పూలు తోటల సాగువైపు రైతులు దృష్టి మరల్చాలని బిసిటి కృషి విజ్ఞానకేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం యలమంచిలి మున్సిపాలిటీ పరిసరాల్లోని రైతులు రమణబాబు, కన్నారావు, వెంకటేశ్వరరావుల పూలతోటలు పరిశీలించి రైతులకు తగిన సూచనలిచ్చారు. ముఖ్యంగా మల్లెపూల తోటల్లో పైరు, పూలు రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.మల్లె తోటల్లో కొత్త రెమ్మల చివరి భాగంలోను, పక్కల నుంచి పూతవస్తుంది. 5 ఏళ్ల వయసున్న తోటల్లో తీగలను భూమికి రెండడుగులు పై భాగాన్ని కత్తిరించాలి. అనంతరం తేలికపాటి తడినిచ్చి, నేల ఆరిన తర్వాత మొక్కల మధ్య దుక్కి చేయాలి. వారం రోజులు ఎండనిచ్చి ప్రతి కోతకు దుక్కి చెయ్యాలి. తగిన మోతాదులో ఎరువుల వాడకం, నత్రజని కోసం యూరియాకు బదులు అమ్మోనియం సల్ఫేట్ ఇవ్వడం వలన పూల వాసన, నాణ్యత పెరుగుతుందని నాగేంద్ర వివరించారు. పూల తోటలు, పండ్ల తోటలు పెంపకం పట్ల ఆసక్తి గల రైతులు బిసిటి కృషి విజ్ఞానకేంద్రాన్ని సంప్రదించవచ్చునని సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : గురువందన్ చాత్రాభినందన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక నరసింగరావుపేట ఎపిటిఎఫ్ భవనంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో గత ఏడాది పదో తరగతిలో శతశాతం మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు. కార్యక్రమంలో బివిసి అనకాపల్లి శాఖ అధ్యక్షులు ఆళ్ల ఓంరామ్, కార్యదర్శి ఎస్ఎబి వర్మ, శివరాం, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పిల్లా నిర్మల, ఉపాధ్యాయులు పీలా కాశి విశ్వేశ్వరరావు, దిబ్బపాలెం సైన్సు ఉపాధ్యాయురాలు బివి లక్ష్మి, కాండ్రేగుల దుర్గాప్రసాద్, ప్రసాద్, రిటైర్డ్ ఎస్ఐ గోపాలరావు పాల్గొన్నారు.

నూకాంబిక జాతరకు పోటెత్తిన జనం

ప్రజాశక్తి-అనకాపల్లి: కొత్త అమావాస్య జాతర సందర్భంగా ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక నెల జాతర సందర్భంగా మొదటి ఆదివారం వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. మంచినీరు మజ్జిగ స్వచ్ఛందసంస్థల ఆధ్వర్యంలో అందజేశారు. పిల్లలకు పాలు ఇచ్చేందుకుప్రత్యేక గదిని కేటాయించారు. పట్టణ సిఐ దాడి మోహనరావు ఆధ్వర్యంలో బందోబస్తు కల్పించారు.

జనసేనలో పలువురు యువకుల చేరిక

ప్రజాశక్తి- మునగపాక రూరల్: నాగులపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయ్ కుమార్ కండువాలు వేసి సాధారణంగా ఆహ్వానించారు. కోరుకొండ ప్రసాద్, శ్రీరామదాసు, కర్రెడ్ల సూర్య ప్రకాష్, పాల్గొన్నారు.

ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి

-ఎంపీ సత్యవతికి సిపిఎం వినతి

ఎంపికి వినతిపత్రాన్ని అందజేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేసి ఆ ప్రాంత ప్రజలకు, ప్రమాదాల బారినపడిన బాధితులకు మెరుగైన వైద్య సదుపాయం కల్పించి ప్రాణాలు కాపాడాలని కోరుతూ ఆదివారం అనకాపల్లిలో ఎంపీ సత్యవతికి వినతిపత్రం అందజేసినట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు స్థానిక విలేకరులకు తెలిపారు.తుని తాండవ బ్రిడ్జి వద్ద నుండి యలమంచిలి వరకు జాతీయ రహదారిపై నిరంతరం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ ప్రాంతాన్ని యాక్సిడెంట్ జోన్ గా ప్రభుత్వం ఇప్పటికే గుర్తించిందన్నారు. జరుగుతున్న ప్రమాదాల కారణంగా గాయపడిన క్షతగాత్రులను నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వస్తారని, వైద్యులు ప్రాథమిక వైద్యం చేసి మెరుగైన వైద్యం అందించడానికి సౌకర్యాలు లేని కారణంగా గాయాల పాలైన క్షతగాత్రులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి, విశాఖపట్నం కేజీహెచ్ కు రిఫర్ చేస్తున్నారని తెలిపారు. సకాలంలో వైద్య అందక గాయపడిన క్షతగాత్రులు మార్గ మధ్యలోనే మరణించడం జరుగుతుందన్నారు. దీంతో అనేక కుటుంబాలు తీవ్రమైన క్షోభకు గురవుతున్నట్లు ఎంపీ దృష్టికి తీసుకు వెళ్లా మన్నారు.బాధితుల పరిస్థితులను అర్థం చేసుకొని నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించి, ట్రామా సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.బాలకృష్ణ, జిల్లా నాయకులు ఎ.రాజు ఉన్నారు .

గోతులపడిన రోడ్డులో వాహనదారుడి అవస్థలు

రోడ్డు ఇలా.. వెళ్లేది ఎలా ?

ప్రజాశక్తి- కోటవురట్ల:మండలంలోని అన్నవరం సెంటర్ నుంచి అన్నవరం గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా ఉంది. అన్నవరం సెంటర్ నుంచి అన్నవరం గ్రామానికి అదేవిధంగా వేములపూడి నాతవరం వెళ్లే రహదారి కావడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని, రోడ్డున ప్రయాణించేందుకు కనీసం నడిచేందుకు కూడా తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి సమయంలో వాహనాలు అదుపు చెప్పి ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. అధికారులు, నాయకులు ఇప్పటికైనా పట్టించుకుని రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు.

అధ్వానంగా ఎఎల్ పురం

నిలిచి పోయిన మురుగునీరు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో ఏకైక మేజర్ పంచాయతీ ఏఎల్పురంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా కొన్ని వీధుల్లో రోడ్ల పై నీరు నిలిచి బురదమయంగా మారి పోతుంది.కొన్ని వీధుల్లో మురుగునీటి కాల్వల్లో పూడికతీతలు చేపట్టక పోవడంతో కొద్దిపాటి వర్షం కురిసినా నీరంతా రోడ్లపై ప్రవహిస్తుంది. ముఖ్యంగా గొల్లపేట, బిసి కాలనీలో ఈ పరిస్థితి మరింతగా ఉంది.పంచాయతీ అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిలిచి పోయిన మురుగునీరు

రోడ్డుకు ఓవైపు తవ్విన భాగం

తవ్వేసి వదిలేశారు..

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో పోలవరం, నర్సీపట్నం రోడ్డు పందూరు గ్రామంలో ఆర్అండ్బి అధికారులు రోడ్డు వైడెనింగ్ నిమిత్తం రోడ్డు తవ్వేసి వదిలేశారు. రోడ్డుకు సమాంతరంగా మెటల్ వేసి లెవెల్ చేయాల్సి ఉంది. లెవెల్ చేయక పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి కావడంతో పాటు పొందూరు గ్రామం నుండి దార్లపూడి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సహ ప్రధానంగా రాత్రి సమయంలో ప్రయాణించే వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాల వెలుతురుతో తవ్విన గోతులు కనిపించక పోవడంతో పక్కకు వెళ్లే క్రమంలో ఈ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

దెబ్బతిన్న పంటను ఏరుతున్న మహిళ

వర్షాలతో మొలకలు

-మినుములు, బొబ్బర్లకు నష్టం

ప్రజాశక్తి -చీడికాడ:గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మినుములు, బొబ్బర్లు పంటలు తడిసి పోవడంతో మొలకెత్తాయి. మండల కేంద్రంలోనే కాక పలు గ్రామాల్లో గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అకాల వర్షాలతో మినుములు, బొబ్బర్ల చేనులు వర్షాలకు గింజలు మొలకెత్తడంతో రైతులు లబో దిబో మంటూ ఆవేదన చెందుతున్నారు. వరి కోత దశలో కూడా వర్షాలు కురియడంతో వరి పంట చేజారిపోగా, ఇప్పుడు ఈ పంటలు కూడా చేతికి రాక పొలంలోనే వర్షాలకు గుర్రై ఉండడంతో రైతులు నష్టపోతున్నారు. వ్యవసాయ అధికారులు స్పందించి రైతుల పొలాల్లో పర్యటించి మినుములు, పెసలు, బొబ్బర్ల పంటల నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పాడైన పంట

ప్రభుత్వాలు స్పందించాలి

రిజర్వేషన్పై మత్స్యకార జెఎసి నేతలు

మాట్లాడుతున్న అమ్మోరయ్య

ప్రజాశక్తి-నక్కపల్లి:మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని మత్స్యకార జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. నక్కపల్లిలో నూకాలమ్మ ఆలయం వద్ద ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మత్స్యకార జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు కంబాల అమ్మోరయ్య మాట్లాడుతూ, దళిత క్రైస్తవులను ఎస్సీ, వాల్మీకి బోయలను ఎస్టి జాబితాలోనూ చేర్చుటకు అసెంబ్లీలో తీర్మానం చేశారని, వలస జీవితాన్ని గడుపుతున్న మత్స్యకారులను కూడా ఎస్టి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారులను గుర్తించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారులను ఎస్టీలో చేర్చడానికి గతంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కమిషన్ వేశారని, నేటి వరకు కార్యరూపం దాల్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి పాదయాత్రలో మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేరుస్తానని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. మత్స్యకారులను ఓట్ల కోసమే వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.బడ్జెట్ లో మత్స్యకారులకు ఏటా రెండు వేల కోట్ల కేటాయించాల్సి ఉండగా, ప్రస్తుతం 175 కోట్ల మాత్రమే అభివద్ధి నిధులను విడుదల చేయడం జరిగిందని,కాబట్టి ఎటు చూసినా మత్స్యకారులకు తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వెలబుచ్చారు.సముద్ర తీర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన రసాయనిక పరిశ్రమల వ్యర్థ జలాలను సముద్రంలోకి వదలడం వలన మత్స్య సంపద నశించి పోవడంతో మత్స్యకారులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు .వలసలు పోతున్నారని అన్నారు .మత్స్యకారుల జీవన విధానాన్ని దష్టిలో పెట్టుకుని న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మత్స్యకార జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుపల్లి నూకరాజు, అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులు గరికిన నూకరాజు,అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీను వాసు,అనకాపల్లి జిల్లా రాజకీయవివరాల కార్యదర్శి మైలపల్లి. ముసులి, నక్కపల్లి మండల అధ్యక్షులు పిక్కినూకనాథం, మండల కార్యదర్శి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

నగదు అందజేస్తున్న భవన నిర్మాణ సంఘం నేతలు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్:మండలంలోని చెట్టుపల్లి గ్రామంలోని మెట్టకాలనీలో ఇటీవల అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన యర్రంశెట్టి కొండబాబు కుటుంబానికి గ్రామ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రూ.20వేలను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు పసుపులేటి అప్పలనాయుడు, కార్యదర్శి గోవింద్ మాట్లాడుతూ, నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. బాధిత కుటుంబాలను ఆదుకోవడంపై రాష్ట్ర రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మోపాడు చిన్నబ్బాయి, పసుపులేటి రాజు, బంటు సోమరాజు, మహాలక్ష్మి, రాజు, గంగిరెడ్డి అప్పలనాయుడు, లంక సత్తిబాబు, పందూరి బాబురావు, ఎర్ర ఈశ్వరరావు, పిల్లా శ్రీను, గళ్ల సూరిబాబు, కర్ణం రాంబాబు, వెంకటరావు, వరహాలరావు తదితరులు పాల్గొన్నారు.

పాడేరులో భారీ వర్షం

-రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి-పాడేరుటౌన్:అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ముసురు వాతావరణం కొనసాగి, ఆ తర్వాత వాతావరణం మారిపోయింది. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. గంటసేపు కురిసిన వర్షానికి పాడేరు పట్టణం తడిచి ముద్దయింది. భారీగా వర్షం కురవడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. అలాగే దూర ప్రాంతాల్లో పిడుగులు పడిన శబ్దాలు వినిపించాయి. ఉరుములతో కూడిన వర్షం పడడంతో జనం ఆందోళనకు గురయ్యారు. భారీ వర్షానికి పట్టణంలోని రోడ్లు వీధులు జలమయమయ్యాయి. చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు.

వేడుకుంటున్న ఆదివాసీలు

రేషన్ కార్డులు ఇప్పించండి

పిత్రిగడ్డ ఆదివాసీలు వేడుకోలు

ప్రజాశక్తి-రోలుగుంట:తమకు రేషన్ కార్డులు ఇప్పించాలంటూ మండలంలోని ఆర్ల పంచాయతీ పిత్రిగడ్డ గ్రామ గిరిజనులు ఆదివారం చేతులెత్తి జిల్లా కలెక్టర్‌ను వేడుకున్నారు. గ్రామంలో 12 కుటుంబాలు వారు జీవనం సాగిస్తున్నారు. 12 సంవత్సరాల నుండి రేషన్ కార్డుల కోసం అధికారులకు వినతిపత్రాలు అందజేసినా నేటికీ రేషన్ కార్డులు ఇవ్వ లేదన్నారు. పిత్రిగడ్డ గ్రామం నుండి శరభవరం సచివాలయంకి వెళ్లాలంటే పది కిలోమీటర్ల ప్రయాణం చేయాలని, అనేకసార్లు తిరిగితే రేషన్ కార్డ్ ఆప్షన్ లేదని, తర్వాత ఇస్తామని చెప్పి సచివాలయం సిబ్బంది చెబుతున్నారన్నారు. తమ గ్రామాలకు వాలంటీర్ లేక పోవడంతో స్వయానా శరభవరం వెళ్లి వాలంటీర్‌కి ఫిర్యాదు చేసినా రేషన్ కార్డ్ ఆప్షన్ వస్తే ఫోన్ చేస్తామని చెబుతున్నారన్నారు. నేటికీ పది సంవత్సరాలు అవుతున్నా రేషన్ కార్డులు లేక పోవడంతో బయట 50 కేజీల చొప్పున బియ్యం కొనుగోలు చేయాలంటే కనీసం 1200 రూపాయలు డబ్బులు అవుతున్నాయన్నారు. కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్న తమకు రేషన్ కార్డులు లేవన్నారు. తమ పిల్లలను స్కూల్లో జాయిన్ చేయడం కూడా అవ్వలేదని, క్యాస్ట్ సర్టిఫికెట్ కావాలంటే రేషన్ కార్డులో తమ పిల్లల పేర్లు ఉండాలన్నారు. రేషన్ కార్డు లేక తమకు అనేక ఇబ్బందులు గురవుతున్నామన్నారు. గ్రామ సచివాలయం ద్వారా అన్ని సేవలు అందిస్తామని చెబుతున్నా కొండ శిఖర గ్రామాలకు కనీసం రేషన్ కార్డు ఇవ్వక పోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా రేషన్ కార్డులు ఇప్పించాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘ సభ్యులు సాధన కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.గోవిందరావు, మండల కార్యదర్శి శ్రీధర్, లక్ష్మణరావు డిమాండ్ చేశారు.

జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక

రావికమతం:జాతీయ ఉపకార వేతనాలకు మోడల్ స్కూలు విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె సత్య సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తమ పాఠశాలకు చెందిన శ్యామ్, లోకనాద్, హర్షిత, రోహిలు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వీరికి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ఏడాదికి రూ.12 వేల చొప్పున విద్యార్థుల ఖాతాలకు జమ చేస్తారన్నారు.

కోటవురట్ల:మండలంలో ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారి అప్పారావు తెలిపారు, రాజుపేట ఎంపీయుపి స్కూలుకు చెందిన ఆడారి కృష్ణ కుమారి, పాములవాక జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పి.దుర్గాప్రసాద్ ఎంపికయ్యారు. వీరికి నాలుగు సంవత్సరాల పాటు రూ.12 వేల చొప్పున స్కాలర్షిప్ అందుతుందని ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఆయా పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

టెన్త్ విద్యార్థులు భయం వీడాలి

ప్రజాశక్తి- పెదబయలు:స్థానిక బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో ఆదివారం గిరిజన గురుకులం డిప్యూటీ సెక్రటరీ రాంమోహన్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం పది నుండి 5వ తరగతి వరకు విద్యార్థులను ఆంగ్ల మాధ్యమం చదివించారు. 8వ తరగతి విద్యార్థులకు ఇటీవల ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్ వినియోగంపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు, రికార్డ్స్ పరిశీలించారు. టెన్త్ విద్యార్థులకు శత శాతం ఫలితాలు సాధించడం ఎలా ? పరీక్షలు ఎలా రాస్తే మంచి మార్కులు సాధించవచ్చు తదితర అంశాలపై సూచనలు, సలహాలు విద్యార్థులకు సూచించారు. స్థానిక ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు డిప్యూటీ సెక్రటరీ శ్రీరాం మోహన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

దత్తతతో ఉత్తమ ఫలితాలు

- స్థాయిని బట్టి టెన్త్ విద్యార్థులను గ్రేడ్‌లుగా విభజన
- ఉపాధ్యాయునికి ఐదుగురు విద్యార్థుల చొప్పున కేటాయింపు
- ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్

విద్యార్థులతో ఉప విద్యాశాఖ అధికారి (ఫైల్)

ప్రజాశక్తి -నక్కపల్లి :టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధనకు విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ అమలు చేసింది. దీంతో ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక తర్ఫీదును ఇస్తున్నారు. ప్రతిరోజు ప్రత్యేక తరగతుల ద్వారా శిక్షణ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ఉపాధ్యాయులు చూపిస్తున్నారు. పిల్లల చదువు విషయంలో తీసు కోవలసిన జాగ్రత్తలపై ప్రతి స్కూల్లోనూ తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

కెజిబివిలో స్టడీ అవర్

మండలంలోని వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవంబర్ నెల నుండి 100 రోజులు ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు, ఫిబ్రవరి నెలలో 50 రోజుల సంసిద్ధత ప్రణాళిక లో భాగంగా ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు కోడి శ్రీనివాసరావు అందించిన వివరాలు..పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 9 వరకు, సాయంత్రం 4 గంటల నుండి 5.30 వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. వారంలో ఒకరోజు విద్యార్థులకు పరీక్ష పెట్టి వారిలో సామర్థ్యాన్ని గుర్తిస్తున్నారు. ఫిబ్రవరి నెలలో 2 రెండు దఫాలు సన్నదత పరీక్షలు, మార్చి నెలలో హెూమ్ టెస్ట్ నిర్వహించారు. పరీక్షా ఫలితాలు ఆధారంగా, చదువులో వెనకబడిన విద్యార్థులను సి, డి గ్రేడ్ లుగా విభజించి ఒక్కొక్క ఉపాధ్యాయుడు 5 గురు విద్యార్థుల చొప్పున దత్తత తీసుకుని, ప్రత్యేక శిక్షణ ఇచ్చి మినిమం పరీక్షలో ఉత్తీర్ణత సాధించడానికి చర్యలు తీసుకుం టున్నారు. విద్యార్థులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా ఆత్మస్థైర్యం పెంపొందేలా ప్రత్యేక కార్యాచరణ ద్వారా తర్ఫీదును ఇవ్వడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు కోడి శ్రీనివాసరావు తెలిపారు.

వేంపాడు హైస్కూల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం కోడి శ్రీనివాసరావు (ఫైల్)

పదిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో పదిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థినిలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. హెూమ్ పరీక్షలు ముగిసిన అనంతరం వాటిలో సాధించిన మార్కుల ఆధారంగా విశ్లేషణ చేసి దత్తత తీసుకున్న టీచర్ల పర్యవేక్షణలో లోపాలను గుర్తించి మంచి ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నాం. పరీక్షల సమయంలో ఒత్తిడి లేకుండా ఉండేలా ధైర్యం కల్పించి, ఏ విధంగా పరీక్షలలో రాస్తే మంచి మార్కులను సాధించ వచ్చో వివ రించాం .

వై.త్రివేణి,
ప్రత్యేక అధికారి,
కె.జి.బి.వి, నక్కపల్లి

సి, డి గ్రేడుల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధనకు ప్రత్యేక కృషి చేస్తున్నాం.విద్యార్థులను దత్తత తీసుకుని స్టడీ అవర్స్ ద్వారా ప్రత్యేక శిక్షణ. విద్యార్థుల సందేహాల నివృత్తి చేయడం. ముఖ్యంగా సి, డి గ్రేడ్ల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించడం జరిగింది. పేరెంట్ కాల్ ద్వారా విద్యార్థుల చదువుపై ప్రతిరోజు ఆరా తీయడం జరుగుతుంది .

గర్లంక వెంకట గోపాలరావు
స్కూల్ అసిస్టెంట్, తెలుగు
జిల్లా పరిషత్
ఉన్నత పాఠశాల, వేంపాడు

సందేహాలు నివృత్తి

ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించి సందేహాలు నివృత్తి చేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ ఎంతగానో ఉప యోగపడుతున్నాయి. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు ప్రత్యేక తర్ఫీదును అందిస్తున్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తానని నమ్మకం కలిగింది.

పి.భవాని
పదో తరగతి విద్యార్థిని,
ఇంగ్లీషు మీడియం.
కె.జి.బి.వి.
నక్కపల్లి

ఒత్తిడి లేకుండా చదువు

ఉపాధ్యాయులు తమపై ఒత్తిడి లేకుండా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రత్యేక టెస్ట్‌లు నిర్వహించి తమ సామర్థ్యాన్ని అంచనా వేసుకుని మెరుగైన ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రణాళికా బద్ధంగా, సమయం వృధా కాకుండా ఉపాధ్యాయులు తమపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.

సి.హెచ్. మహలక్ష్మి
పదో తరగతి విద్యార్థిని
ఇంగ్లీషు మీడియం.
కె.జి.బి.వి.స్కూల్.
నక్కపల్లి

ప్రజా వైద్యులు వైఎల్.నర్సింగరావుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర మెడికల్ కాలేజీ గైనకాలజీ విభాగాధిపతి, ప్రజా వైద్యులు డాక్టర్ వైఎల్.నర్సింగరావు దంపతులను అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎపి మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కె.సత్య వరప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్ర మెడికల్ కాలేజీకి వైఎల్.నర్సింగరావు చేసిన సేవలను కొనియాడారు. మరొక ముఖ్య అతిథి సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ వైఎల్.నర్సింగరావుతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పేదలకు ఆయన వైద్యపరంగా ఎంతగానో సేవలందించారని కొనియాడారు. అటువంటి వారి సేవలు ఉద్యోగ విరమణతో ముగిసిపోకూడదని, మరింతకాలం ప్రజా సేవలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విమ్స్ డైరెక్టర్ కె.రాంబాబు, అల్లూరి విజ్ఞాన కేంద్రం కోశాధికారి పద్మనాభరాజు, ఆరోగ్య విభాగం బాధ్యులు కామేశ్వరరావు పాల్గొన్నారు. సన్మాన కార్యక్రమానికి ముందు హెచ్3ఎన్2, కోవిడ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆంధ్ర మెడికల్ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ పిజె.శ్రీనివాస్, పల్మనాలజిస్ట్ డాక్టర్ కె.ఫణీంద్ర ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఎవికె ఆరోగ్య విభాగం హెడ్ టి.కామేశ్వరరావు అధ్యక్షత వహించారు.

వైఎల్.నర్సింగరావు దంపతులను సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న సిహెచ్.నర్సింగరావు

క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ 4వ వార్షిక జనరల్ బాడీ సమావేశం ఆదివారం విశాఖలోని ఫెయిర్‌ఫీల్డ్ మారియట్ హోటల్‌లో జరిగింది. ఈ సమావేశం అనంతరం క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ మేనేజింగ్ కమిటీ ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఎన్నికలను నిర్వహించడానికి ఐదుగురితో ఎన్నికల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో 2023-25కిగాను క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ కొత్త ఆఫీస్ బేరర్లను ఎన్నుకున్నారు. నూతన చైర్మన్‌గా ఆళ్ల శివారెడ్డి (గుంటూరు), అధ్యక్షులుగా వైవి.రమణారావు (విజయవాడ), ప్రధాన కార్యదర్శిగా బయన శ్రీనివాస్ (విశాఖపట్నం), ఉపాధ్యక్షులుగా జివిఎస్‌టి.రాయుడు (కర్నూలు), కె.సుభాష్ చంద్రబోస్ (విజయనగరం), జె.సురేష్ కుమార్ రెడ్డి (కర్నూలు), కోశాధికారిగా పి.రాజశేఖర్‌రావు (తిరుపతి), సంయుక్త కార్యదర్శులుగా వి.భీమశంకర్ (రాజమండ్రి), కె.రమేష్ అంకినీడు (విజయవాడ) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యులందరి మద్దతు, సహకారంతో క్రెడాయ్ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్తామన్నారు. పూర్వ కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు